26_NOV_2023_SUNMAG P30 Real 11/17/2023 10:22 PM Page 18

అర్థం కాలేదు.

'ఫరూక్‌తో మనమ్మాయికి నిఖా పక్కా చేసుకుని వచ్చాను'.. అని నాన్న చెప్పినపుడు, అమ్మ భీకరంగా పోట్లాడిన విషయం తనకు గుర్తుంది. దెబ్బలు తింటూ కూడా అమ్మ ఆడపులిలా గర్జిస్తూనే ఉన్నది.

ఫరూక్‌కు దాదాపు నలభై ఐదేళ్లుంటాయి. ఇద్దరు కూతుర్లు. వాళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. రెండేళ్లక్రితం అతని భార్య గుండెజబ్బుతో చనిపోయింది. ఆఫ్రీన్‌ను రెండో పెళ్లి చేసుకోవాలని అతని ఉబలాటం. లాడ్‌బజార్‌లో అతనికి గాజుల దుకాణం ఉంది. డబ్బుకు కొదువ లేదు.

అజహర్ బలహీనతలేమిటో అతనికి తెలుసు.

* * *

''అంత అందమైన కూతురుండగా సారాయి తాగాల్సిన ఖర్మేం పట్టింది? బాగా డబ్బున్నవాడికిచ్చి నిఖా చేశావనుకో.. అప్పుడు రోజా ఫారెన్ విస్కీ తాగొచ్చు'' అంటూ ఉచ్చులోకి లాగాడు ఫరూక్.

''అంత డబ్బున్న పెళ్లికాని యువకులు మన ఇలాఖాలో ఎవరున్నారు?'' అని అజహర్ అడిగినప్పుడు..

''యువకులే కావాలా? రెండో పెళ్లివాళ్లు పనికిరారా? వాళ్ల దగ్గరే లక్షలకు లక్షలు మూల్గుతుంటాయి'' అంటూ మరింత ఉచ్చు బిగించాడు.

''ఎవరో ఎందుకు? నేనే చేసుకుంటాను. నీ అప్పులన్నీ తీరుస్తాను. నీకు కొత్త ఆటో కొనిస్తాను. ఆలోచించు''.. అంటూ తన చివరి అస్త్రం ప్రయోగించాడు. ఆ గాలానికి అజహర్ చిక్కుకున్నాడు.

''పదిహేనేళ్ల మనమ్మాయిని ఆ ఫరూక్‌కు ఇచ్చి పెళ్లి చేస్తారా? మీకేమైనా మతి పోయిందా? మీకన్నా వయసులో పదేళ్లు పెద్దవాడు కదండీ! డబ్బుకు ఆశపడి కూతురి జీవితంలో నిప్పులు పోస్తారా!?'' అంటూ నిలదీసింది ఫరీదా.

''అరబ్ నిఖాల గురించి వినలేదా? పదిహేను పదహారేళ్ల అమ్మాయిల్ని అరవై ఏళ్లు దాటిన అరబ్ షేకులకిచ్చి నిఖాలు చేయడం లేదా? నేను చేస్తున్నది అంతకంటే ఘోరమేమీ కాదే!'' అన్నాడు.

''దాన్ని నిఖా చేయడం అనరు. కూతుర్ని అమ్ముకోవడం అంటారు. అలాంటి వాణ్ని తండ్రి అనరు.. 'థూ!' అని ఊస్తారు'' అంటూ.. పక్కన 'థూ!' అంటూ ఊసింది.

అజహర్ కుడికాలితో ఆమె డొక్కలో తన్నాడు. పెద్దగా అరుస్తూ కింద పడిపోయింది.

''నువ్వు కూతుర్ని కన్నా ఎందుకు భరించానో తెలుసా? దండిగా మెహర్ వస్తుందన్న ఆశతోనే! నువ్వు చచ్చి గీపెట్టినా ఈ పెళ్లి ఆగదు'' అన్నాడు.

అదంతా గుర్తుకొచ్చి ఆఫ్రీన్ మనసంతా వికలమైపోయింది. నిఖా జరక్కుండా అమ్మ ఎలా ఆపుతుందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

* * *

ఇంటి ముందు షామియానా వేసి, అక్కడ ఫరూక్‌ను, బంధువుల్ని కూచోబెట్టాడు అజహర్. ఇంటిలోపల ఆఫ్రీన్ పెళ్లి బట్టల్లో మెరిసిపోతున్నది. పెళ్లి ఇష్టంలేదని పోట్లాడిన తల్లీకూతుళ్ల మొహాల్లో చిరునవ్వులు చూసి.. అజహర్ మొదట కంగారుపడ్డాడు. తన దెబ్బలకు భయపడి లొంగిపోయి ఉంటారనుకుని గర్వపడ్డాడు.

ఖాజీ వచ్చేశాడు. ఖురాన్‌లోని కొన్ని సూరాలు చదివాడు. ఇంటి లోపలికి ఇద్దరు సాక్ష్యులతో వెళ్లి ఆఫ్రీన్ ఎదురుగా నిలబడి..

''ఫరూక్ మియాసే నిఖా కుబూల్ హై?'' అని అడిగాడు ఖాజీ.

''నహీ!'' అన్నది ఆఫ్రీన్.

ఖాజీ కంగారు పడి..

''కుబూల్ హై! అనాలి బేటీ'' అన్నాడు.

''కుబూల్ నహీ హై'' అన్నది ఆఫ్రీన్ దృఢంగా..

ఖాజీ నిరుత్తరుడై.. 'ఏమిటిదంతా?' అనేలా అజహర్ వైపు చూశాడు.

అప్పటికే అజహర్ కోపంతో ఊగిపోతున్నాడు.

''చమడాలు ఒలిచేస్తాను. 'కుబూల్ హై!' అని చెప్పు''.. అంటూ ఆఫ్రీన్ భుజం పట్టుకుని కుదిపాడు.

''కుబూల్ నహీ!'' అంటూ పెద్దగా అరిచింది ఆఫ్రీన్.

''ఇదంతా నువ్వూ, మీ అమ్మా కలిసి పన్నిన పన్నాగం కదా. మిమ్మల్ని వదలను. మీ రక్తం కళ్ల చూస్తాను. 'కుబూల్ హై!' అని చెప్పలేదో.. ముక్కలు ముక్కలుగా నరుకుతాను''.. అజహర్ పిచ్చిపట్టినట్టు అరుస్తున్నాడు.

''దుల్హన్ ఇష్టపూర్వకంగా, ఎవరి ప్రోద్బలం లేకుండా 'కుబూల్ హై!' అనాలి బర్ఖుర్దార్. అప్పుడే నిఖా జరుగుతుంది. బెదిరించి, భయపెట్టి 'కుబూల్ హై!' అనిపించినా.. అది చెల్లదు. ఈ నిఖా జరగదు'' అంటూ ఖాజీ బైటికి వెళ్లిపోయాడు.

విషయం తెలుసుకున్న ఫరూక్.. పూనకం వచ్చినవాడిలా ఊగిపోయాడు.

''అరే అజహర్! నన్నే మోసం చేస్తావురా? నా బంధువుల ముందు అవమానం చేస్తావురా? నీ అంతు చూస్తారా. నా దగ్గర తీసుకున్న డబ్బులన్నీ కక్కిస్తారా'' అంటూ అరుస్తున్నాడు.

ఫరూక్‌ను బుజ్జగించడం కోసం బైటికి వెళ్లబోతూ.. ఫరీదా వైపు చూశాడు అజహర్. ఆమె పెదవుల మీద విజయగర్వంతో కూడిన నవ్వు చూసి.. ''ఇప్పుడు కాదు! వీళ్లందరూ వెళ్లిపోయాక నీ సంగతి తేలుస్తాను'' అంటూ పళ్లు కొరికాడు.

ఖాజీతోపాటు మిగతా కులపెద్దలు, బంధువులు వెళ్లడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో ఫరీదా బైటికొచ్చి..

''దయచేసి కొద్దిసేపు కూర్చోండి. మీ అందరి సమక్షంలో నేనో నిర్ణయం తీసుకోబోతున్నాను'' అన్నది.

బురఖా లేకుండా అంతమంది మగవాళ్ల మధ్యకొచ్చి నిలబడ్డ ఫరీదాను చూసి..

''ముందు లోపలికెళ్లు. బేషరం ఔరత్!'' అంటూ తిట్టాడు అజహర్.

ఫరీదా అతణ్ని పట్టించుకోకుండా ఖాజీ వైపు తిరిగి..

''నేను నా షౌహర్‌కు విడాకులు ఇవ్వాలనుకుంటున్నాను. నాకు ఖులా కావాలి'' అన్నది.

ఖాజీ మొదట ఆశ్చర్యానికి లోనైనా.. తన్ను తాను సంబాళించుకుంటూ, అజహర్ వైపు తిరిగి..

''నీ బేగం ఖులా కావాలంటున్నది. నీకు సమ్మతమేనా?'' అని అడిగాడు.

అతను సమాధానం చెప్పేలోపలే ఫరీదా కల్పించుకుంటూ..

''అతనికి అభ్యంతరం ఎందుకుంటుంది జనాబ్? చాలా పౌరుషమున్న మగాడు. సంపాదన ఉంది. ఖులా వల్ల మాకు ఇబ్బందిగానీ, అతనికేం నష్టం? నేనతణ్ని వద్దంటున్నా.. 'నువ్వే కావాలి' అని ప్రాధేయపడటానికి అతనికి సిగ్గూశరం లేదనుకుంటున్నారా?'' అన్నది.

అదంతా అతణ్ని రెచ్చగొట్టి, ఖులాకు అనుమతి ఇచ్చేలా చేయడంకోసం మాట్లాడిన మాటలు.. ఖులా విషయంలో రకరకాల అభిప్రాయాలు ఉన్నాయని మతపెద్దలు చెప్పారు. భర్త అంగీకారం తెలుపకున్నా.. ఖులా పూర్తయినట్టేనని తీర్పు చెప్పే అధికారం ఖాజీకి ఉందని కొంతమంది చెప్పారు. భర్త అనుమతి లేకపోతే ఖులా చెల్లదనీ, భర్త కోర్టుకెళ్లే అవకాశం ఉందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. ఇటువంటి అవరోధాలేమీ లేకుండా ఖులా లభించాలని ఫరీదా కోరుకుంది.

ఆమె ఆశించినట్టే అజహర్ పౌరుషానికెళ్లాడు.

''నాకు సమ్మతమే!'' అని ఖాజీతో చెప్పాడు.

''ఆమెతో ఫారక్తుని అని చెప్పు. అంటే.. 'నేను నీనుంచి విడిపోతున్నాను' అని అర్థం'' అన్నాడు ఖాజీ.

అజహర్ ఫరీదా వైపు తిరిగి..

''ఫారక్తుని'' అన్నాడు.

ఖాజీ ఖులానామాను తయారుచేసి, వాళ్లిద్దరి సంతకాలతోపాటు సాక్ష్యుల సంతకాలు కూడా తీసుకున్నాడు.

* * *

తమ బట్టలతోపాటు అవసరమైన సామగ్రి సర్దుకొని తల్లీకూతుళ్లు ఇంటి బైటికి అడుగుపెట్టారు.

''అమ్మీ.. 'నిఖా జరక్కుండా అడ్డుపడే ప్లాన్!' అని కదా చెప్పావు. ఈ ఖులా గురించి చెప్పనేలేదే. ఇప్పుడు మనం ఎక్కడుంటాం? ఎలా బతుకుతాం?'' దిగులుగా అడిగింది ఆఫ్రీన్.

ఫరీదా హాయిగా నవ్వింది.

''వారం కిందే ఓ ఇల్లు అద్దెకు మాట్లాడిపెట్టాను. ఇక బతుకు తెరువు అంటావా!? నాకు ఉర్దూ, అరబ్బీ వచ్చుగా. నలుగురు పిల్లలకు పాఠాలు చెప్పుకొనైనా బతకొచ్చు. బందీఖానాలో ఉండి, ఆత్మాభిమానం చంపుకొని, పరమాన్నం తినడం కన్నా.. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆస్వాదిస్తూ, గంజి నీళ్లు తాగినా అది అమృతంతో సమానం. అన్నిటికన్నా తలెత్తుకుని బతకడం ముఖ్యం'' అన్నది.

వాళ్లిద్దరూ ముందుకు నడుస్తూ ఉంటే.. సంకెళ్లు తెగిపడుతున్న శబ్దం శ్రావ్యంగా వినిపించసాగింది. ■

## సయ్యద్ సలీం



సమాజంలోని సమస్యలను భిన్న కోణాల్లో పరిశీలించి.. వాటిని కథలుగా మలుస్తున్నారు సయ్యద్ సలీం. ప్రకాశం జిల్లా త్రోవగుంట ఈయన స్వస్థలం. ఎమ్మెస్సీ చేశారు. ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. మూడు కవితా సంపుటాలు, పది కథా సంపుటాలు, 30 నవలలు వెలువరించారు. పలు రచనలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆంగ్లంలో 13 పుస్తకాలు, హిందీలో 6 పుస్తకాలు, మరాఠీలో 6, ఒరియాలో 9, కన్నడలో 16, మలయాళంలో 4, తమిళంలో ఒక నవల.. పుస్తకరూపంలో వచ్చాయి. బాలల కోసం ఆరు సై – ఫై నవలికలు రాశారు. భాషా పురస్కారం, చాసో సాహిత్య పురస్కారం, వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారం, కొవ్వలి సాహిత్య పురస్కారం, మాడభూషి రంగాచారి స్మారక పురస్కారం, అభ్యుదయ సాహితీ పురస్కారం.. ఈయన అందుకున్న పురస్కారాలలో కొన్ని. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఈయన రచనల మీద పన్నెండు మంది పీహెచ్‌డీ/ ఎంఫిల్ చేశారు. తరతరాల అణచివేతకు, తలాక్ బెదిరింపులకు తలొగ్గకుండా.. ఎదురుతిరిగి, ఆత్మాభిమానంతో బతకడానికి సిద్ధపడ్డ ఓ ముస్లిం మహిళ కథే 'సంకెళ్లు' అని రచయిత చెబుతున్నారు.